www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023



మొండి వైఖరి విడనాడాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు: కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఆర్‌టిసి 2 డిపో మేనేజర్ తన మొండి వైఖరిని విడనాడి కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌టిసి 2 డిపో ఎదుట ఉద్యోగులు 5వ రోజు ధర్నా చేపట్టారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా. సుబ్రహ్మణ్యం, జిల్లా సహాయ కార్యదర్శి కెకె మూర్తి, డిపో సమాయ కార్యదర్శి ఎస్‌కె షబ్బీర్, ఎస్‌ఎస్ రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసిలకు అన్యాయం జరిగింది..!

టిడిపి నేత నారా లోకేష్

కావలి నియోజకవర్గంలో బంగారుపాళెంలో బిసిలతో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ఆదివారం కావలి నియోజకవర్గంలోని బంగారుపాళెంలో జరిగిన బిసి సామాజిక వర్గం ప్రతినిధులతో ఆయన ముఖా ముఖీ నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో మత్స్యకారులకు ఎటువంటి సాయం అందడం లేదన్నారు. టిడిపి హయాంలో బోట్లు, వలలు ఇచ్చేవారు.. ఇప్పుడు ఏమి ఇవ్వడం లేదని లోకేష్ తెలిపారు. ఆక్వా రైతులకు ఎటువంటి సాయం అందడం లేదని, . విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ఆక్వా రంగాన్ని జగన్ దెబ్బతీశారన్నారు. గొర్రెల పెంపకం కోసం జగన్ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించడం లేదన్నారు. వైసిపి నేతలు దాడులు చేసినా షాప్ వైసిపి నాయకులు ధ్వంసం చేశారని లోకేష్ దగ్గర ఆవేదన వ్యక్తం చేసింది. తన 16 ఏళ్ల కుర్రాడిపై కేసు పెట్టి వేధిస్తున్నారని రమాదేవి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. రజకులను జగన్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, . కనీసం రూ. 10 వేల రుణం కూడా ఇవ్వలేదన్నారు. ఆదరి సమస్యలు విన్న లోకేష్ మాట్లాడుతూ బిసిలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది టిడిపిలోనేనన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఆదరణ పథకం ప్రవేశ పెట్టింది టిడిపినేన్నారు. బిసి సబ్ ప్లాన్, కార్పొరేషన్ ద్వారా బిసిలకు రుణాలు ఇచ్చింది రాజకీయంగా, ఆర్థికంగా బిసిలను ఆదుకుంది తామేనన్నారు. టిడిపి హయాంలో కీలక పోస్టులు అన్ని బిసిలకే ఇచ్చామన్నారు. మీరు పాలిచ్చే ఆవుని వదులుకొని తన్నే దున్నపోతుని తెచ్చుకున్నారని చమత్కరించారు. 15 ఏళ్ల అమర్నాథ్ గౌడ్ ని కొట్టి పెట్రోల్ పోసి తగలబెట్టింది. వైసిపి నేతలు. కాదా అన్నారు. బిసి పోస్టులు అన్ని బిసిలకే. చంపేసి లక్ష రూపాయలు రేటు కట్టారన్నారు. టిడిపి అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచిందన్నారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కట్ చేసి 16,500 మంది బిసిలను పదవులకు జగన్ దూరం చేశారన్నారు. జగన్ బిసి కార్పొరేషన్లు నిర్వీర్యం చేశారు, బిసి సంక్షేమ శాఖ బాధ్యతని చూస్తే జాలేస్తుందని, సిబ్బందికి జీతాలు ఇవ్వక మంత్రి కార్యాలయానికి సిబ్బంది తాళం వేశారన్నారు. "ఆక్వా రైతుల కష్టాలు నాకు తెలుసు. ఎకరం సేటే తక్కువ ఉన్న చెరువు కి రూ.27 వేల బిల్లు వచ్చింది. టిడిపి హయాంలో కేవలం రూ.5 వేలు బిల్లు వచ్చేది అని నిన్న నన్ను కలిసిన ఆక్వా రైతు చెప్పాడు" అని అన్నారు. గొర్రెల పెంపకానికి ఎటువంటి సాయం జగన్ ఇవ్వడం లేదని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెలు కొనడానికి రుణాలు ఇస్తామని, సబ్సిడీ లో మందులు అందజేస్తామని, మేపు కోవడానికి బంజరు భూములు కేటాయిస్తామని చెప్పారు. చెరువులు మత్స్యకారులకు అందజేస్తామన్నారు. జగన్ తగ్గించిన స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచుతామన్నారు. .జీఓ .217 ని టిడిపి అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజుల్లోనే రద్దు చేస్తాం. చెరువులు మత్స్యకారులకు అందజేస్తామని, 8 వేల ఎకరాల భూమి వైసిపి ప్రభుత్వం బిసిల నుండి వెనక్కి లాక్కుంది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ భూమి బిసిలకు కేటాయిస్తామన్నారు.టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, బీద జ్యోతి, ఎం. సుబ్బనాయుడు, కావ్య కృష్ణారెడ్డి, బీద గిరిధర్ ఉన్నారు. అనంతరం వెయ్యి మంది యువకులకు సెల్ఫీ విత్ నారా లోకేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనీలా.. ఇంత అవినీతా..!

టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ అవినీతికి అడ్డు అదుపులేకుండా పోయిందని, టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ బాబు అనిల్ అవినీతి గురించి లెక్కలు బయటపెట్టారని, దీనికి ఆయన దేవుడు మీద ప్రమాణం చేస్తున్నారన్నారు. కోవూరు ప్రాంతం లో మిత్రుడు పేరుతో భూమి రిజిస్ట్రేషన్ చేశారని, ఆయన పిఎ ఇంటులో సాక్షిగా ఉన్నారని ఆధారాలతో బయట పెట్టారు. అవినీతికి పాల్పడుతూ దేవుడు మీద ప్రమాణం చేస్తే భార్య బిడ్డలకు మంచిదికాదన్నారు. ఆస్తులకు సంబంధించి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ దేవాలయంలో ప్రమాణం చేసే సమయంలో తన మంది మార్బలాన్ని తీసుకొని వచ్చి దేవస్థానంలో కుర్చీలు వేసి రాజకీయాలకు సంబంధించిన సమావేశాన్ని ఎలా పెడతారని ఆనం వెంకట రమణారెడ్డి విమర్శించారు. దేవుడు వెనకవైపు ఉంటే అనిల్ ముందువైపు ప్రమాణం చేశారన్నారు. రాజకీయాలకు దేవాలయలను వాడుకోవడానికి అనిల్కు బుద్ధుందా అంటూ ప్రశ్నించారు. దేవాలయాలు అంటే అనిల్ కు లెక్కలేకుండా పోయిందన్నారు.

కోర్టులో నూతన భవనాలు ప్రారంభం

హాజరైన రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎవి శేషసాయి

ప్రజాశక్తి -నెల్లూరు

న్యాయవాద వృత్తిలో రాణిం చాలంటే బాగా వాదించగలగడంతో పాటు సందర్భాను సారంగా మౌనంగా ఉండటం అనేది చాలా ముఖ్యమైన విషయమని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేష సాయి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయస్థాన నూతన భవనాలను హైకోర్టు తాత్కాలి న్యాయమూర్తి ఎవి శేషసాయి జిల్లా న్యాయమూర్తి జస్టిస్ డి రమేష్‌తో కలిసి జస్టిస్ శేష సాయి ప్రారంభించారు. నూతన భవనాలను ప్రారంభించేందుకు వచ్చిన హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శేష సాయిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని, ఎస్ పి తిరుమలేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోలీసు గార్డ్స్ నుంచి ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పూజలు నిర్వహించి కోర్టు కాంప్లెక్స్ నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జస్టిస్ శేష సాయి మాట్లాడుతూ తక్కువ వ్యవధిలోనే భవన నిర్మాణాలను పూర్తిచేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటానికి కష్టి చేసిన వారికి అభినందనలు తెలిపారు. భవన నిర్మాణాల కోసం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ డి రమేష్ తదితరులు ప్రత్యేక శ్రద్ధపెట్టారని ప్రశంశించారు. న్యాయమూర్తుల మంచి తీర్పులు వస్తున్నా యంటే ఆయా న్యాయవాదులు మంచిగా వాదిస్తున్నారని అర్థమౌతుం దన్నారు. బార్ అసోసియేషన్ బాగుంటేనే బెంచ్ కూడా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి డాక్టర్ యామిని, జిల్లా ఎస్ పి తిరుమలేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, బార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వర్, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాద గుమస్తా అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

భవనాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి

పునరావాసం కల్పించాలి

గుడ్లూరు :రామాయపట్నం ఓడరేవు పరిధిలో ఉన్న కర్లపాలెం వాసులకు పునరావాసం కల్పించాలని గ్రామస్తులు అధికారులకి విజ్ఞప్తి చేశారు. తీరంలో ఉన్న ఆవులు వారి పాలెం, మొండి వారి పాలెం వాసులకి తెట్టు నుంచి రామాయపట్నం కు వెళ్లే రహదారి పక్కన పునరావాసం కల్పించి గహాలు నిర్మిస్తున్నారు. భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించి ఉన్నారు. 160 కుటుంబాలు ఉన్న కర్లపాలెం వాసులకు ఇంతవరకు ఎలాంటి పునరావాసం కల్పించకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొండి వారి పాలెం గ్రామాల కుటుంబాల వారికి పునరావాసం కల్పించిన ప్రాంతంలోనే తమకు కూడా పునరావాసం కల్పించాలని భూములు కోల్పోయిన వారికి పరిహారం కూడా చెల్లించాలని గ్రామస్తులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

గ్రావెల్ గుంటలోపడి బాలుడు మృతి

వెంకటాచలం :ఈత కెళ్లి బాలుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం గొలగమూడి ఆంజనేయపురం చెందిన మౌలాలి కుమారుడు హిమాయత్ తుల్లా(7) మరో ఇద్దరు పిల్లలు చెరువులో ఈతకు వెళ్లారు. ముందుగా హిమాయత్తుల్లా గ్రావెల్ గుంట దిగాడు. ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో గ్రామస్తులకు సహచర పిల్లలు సమాచారం ఇచ్చారు దీంతో కుటుంబ సభ్యులు పోలీసుల సమాచారం ఇచ్చారు. గ్రావెల్ గుంట లో గాలించారు. గ్రావెలకుంటలో గాలింపులో బాలుడు కనిపించేటప్పటికి మృతిచెంది కనిపించాడు. మతి చెందిన హిమాయతుల్లా (7) గోలగముడి ఆశ్రమ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. మౌలాలికి బాలుడు తోపాటు ఒక కుమార్తె ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టి శ్రీరాములు ఇంటిని సందర్శించిన నారా లోకేష్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కావలి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఆదివారం జువ్వలదిన్నెల్లోని అమరజీవి పొట్టి శ్రీరాములు నివాసానికి వెళ్లారు. ఆయనకు నివాళి అర్పించారు. మద్రాసు-కలకత్తా రహదారి నుంచి కావలి నియోజకవర్గం ఎస్ వి పాలెం మీదుగా జువ్వలదిన్నె వెళ్లే రహదారిలో చిప్పలేరు వాగుపై నిర్మించిన వంతెన. గత టిడిపి ప్రభుత్వం హయాంలో 25.30 కోట్లతో నిర్మించిన ఈ బ్రిడ్జిని 11-1-2019న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన పుటి నుంచి అందినకాడికి దోచుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి ఒక్క పనైనా చేశారన్నారు. జువ్వలదిన్నెను అభివద్ధి చేసింది టిడిపి ప్రభుత్వ మేనన్నారు. హైదరాబాద్ ఎన్‌టిఆర్ మోడల్ స్కూల్లో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడిన 35 మంది పూర్వ విద్యార్థులు యువనేత నారా లోకేష్ ను కలిశారు. 151వ రోజు యువగళం పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను బంగారుపాలెం క్యాంప్ సైట్ లో ఆదివారం కలిసి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, సాఫ్ట్ వేర్, వివిధ రంగాల్లో స్థిరపడిన వారిని లోకేష్ అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన తమను ఎన్‌టిఆర్ మోడల్ స్కూలు అమ్మలా అక్కున చేర్చుకుందని తెలిపారు. మంచి హాస్టల్‌తోపాటు కార్పొరేట్ స్థాయి విద్యను ఎన్‌టిఆర్ మోడల్ స్కూల్ తమకు అందించడంతో ఇప్పుడు జీవితంలో సెటిలయ్యామని తెలిపారు. ఎన్టీఆర్ మోడల్ స్కూల్లో చదివే వారిలో 80 శాతం మంది ఐఐటి, నీట్ లో ప్రవేశాలు పొందుతున్నారని చెప్పారు. మరికొందరు క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికై విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్ లో మరింత ఉన్నత స్థానానికి చేరుకొని, మీలాంటి మరికొందరికి చేయూత నందించాలని లోకేష్ పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములు గృహాన్ని సందర్శించి, నివాళి అర్పిస్తోన్న నారా లోకేష్

'యువగళం' పాదయాత్ర జయప్రదానికి కృషి

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజకవర్గంలో త్వరలో జరగనున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రపై చర్చించేందుకు ఉలవపాడు టిడిపి కార్యాల యంలో ఆదివారం మండలస్థాయి సమావేశం నిర్వహిం చారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం హాజర య్యారు. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ ఉదయం రాళ్లపాడు ప్రాజెక్టు మీదుగా లోకేష్ నియోజ కవర్గంలోకి ప్రవేశి స్తారన్నారు. అందుకోసం భారీఎత్తున స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శివరాం మాట్లాడుతూ అన్ని మండలాల నుంచి ప్రజల స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన క్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీని వాసులు, అన్ని గ్రామాల నుంచి పార్టీ అధ్యక్షులు హాజరయ్యారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- కందుకూరు : మండలంలోని దూబగుంటలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు దాసరి బ్రహ్మయ్య, కోసూరి మాధవలకు దోబగుంట గ్రామస్తులు ఆదివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేసి సన్మానించారు. వారు ఆ పాఠశాలలో ఎనిమిదేళ్లకు పైబడి నిబద్ధతతో పనిచేశారని, అనేకమంది విద్యా ర్థులను గురుకుల పాఠశాలలకు ఎంపిక చేశారన్నారు. ఇటీవల ఉద్యో గోన్నతిపై కావలి మండల విద్యాశాఖ అధికారిగా వెళ్లిన బండి గోవిందయ్యను బండి మాల్యాద్రి, గోచిపాతల ప్రసాద్ , తుమ్మ వేణు తలారి వంశీ సత్కరించారు. బిటిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కండ్లగుంట మోహన్‌రావు, ఉపాధ్యాయులు అబ్దుల్లా ఎం రమణయ్య, కె రవీంద్ర, తుమ్మ హరి బాబు, బండి ధనమ్మ, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఘనంగా పొంగళ్లు

ప్రజాశక్తి -పొదలకూరు : పొదలకూరులో గంగమ్మ తల్లికి గ్రామ పొంగళ్ళు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరుగుతోంది. త్వరలోనే అమ్మవారిని ప్రతిష్టించనున్నారురు. భక్తులు తమ వంతుగా ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం జి.ఎం.ఆర్ కూరగాయల షాప్ యజమాని గుమ్మా మోహన్ రావు భార్య అంజలి కుమార్తె అనురాధ, కుమారుడు మహేష్ బాబు రూ 25116లు విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు కనిపించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడ్లూరు :తన తల్లి, తమ్ముడు గత పది రోజుల నుంచి కనిపించడం లేదని గుడ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన శాలిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు వివరాల మేరకు గుడ్లూరు ఎస్‌సి కాలనీకి చెందిన నిర్మల, ఆమె ఏడేళ్ల కుమారుడు గత పది రోజుల నుంచి కనిపించడం లేదు. దీంతో నిర్మల కుమార్తె శాలిని గుడ్లూరు హైదరాబాదులో ఉన్న తన తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. తర్వాత బంధువుల ద్వారా గాలింపు చర్యలు చేపట్టిన కనిపిం చకపో వడంతో చివరకు పోలీసులను ఆశ్రయించినట్లు నిర్మల కుమార్తె శాలిని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు :ఎపి ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి అంజాద్ భాషా ఆంధ్రప్రదేశ్ మైనార్టీ అధ్యక్షులు ఖాదర్ బాషా ఆదేశాల మేరకు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్‌ఆర్- హమ్ సబ్ జగన్ కె సాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పెద్ద మసీదులో అసర్ నమాజ్ ను ఆచరించారు. అనంతరం మసీదు ప్రాంగణంలో స్థానిక ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహిం చారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ సభ్యులు సందని భాష బాషా మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు.

సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు :సమిష్టి కృషి అంకితభావంతో 92 రోజుల పాటు ఉద్యమాన్ని నడపబట్టే ప్రభుత్వం చర్చలకు పిలిచి సహృద్భావ వాతావరణంలో కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించిందని సమిష్టిగా పోరాటాలు చేస్తే మిగిలిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఎపి జెఎసి అమరావతి ఉద్యమం ముగిసిన సందర్భంగా ఏడు జిల్లాల (ప్రకాశం, పల్నాడు, బాపట్ల, గుంటూరు, నెల్లూరు, తిరుపతి చిత్తూరు) నాయకత్వానికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలి శెట్టి దామోదర్ రావు హాజరై మాట్లాడారు.ఉద్యమం విజయవంతానికి సంపూర్ణ మద్దతు ఇచ్చిన సిఐటియు, ఎఐటియుసి రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల చైర్మన్ ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఎపి జేఏసీ అమరావతి లోని వివిధ భాగస్వామ్య సంఘాల మద్దతుతోనే ఉద్యమాన్ని గాంధేయ మార్గంలో చేసి ప్రభుత్వం ద్వారా అనేక సమస్యలు పరిష్కరించుకొని సాధించుకు న్నామన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం శుభ పరిణామన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసుగా పరిగణించి, వారిచే పోలీసు విధులు నిర్వహిస్తున్నారని, ఒత్తిడి కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఇష్టం లేని మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా కార్యదర్శి గా నే కొనసాగించాలన్నారు ఈ అభినందన సభలో నెల్లూరు జిల్లా చైర్మన్ పెంచల్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ,చిత్తూరు జిల్లా చైర్మన్ అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ, తిరుపతి చైర్మన్ గోపీనాథ్ రెడ్డి, గుంటూరు చైర్మన్ సంగీతరావు, ప్రధాన కార్యదర్శి కిరణ్ ,బాపట్ల చైర్మన్ కే సురేష్ ప్రధాన కార్యదర్శి ,ప్రకాశం జిల్లా చైర్మన్ ఆర్ వి కష్ణమోహన్, పల్నాడు జిల్లా చైర్మన్ కే నాగమల్లేశ్వరరావు జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులు టీ ఫణి పేరాజు సంసాన శ్రీనివాస్ రావు, ఎస్ మల్లేశ్వరరావు, వసంత రాయలు ,కుమార్ రెడ్డి, శివకుమారి రెడ్డి ఆర్లయ్య పాల్గొన్నారు.

వైద్య విజ్ఞానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నెల్లూరు : గ్రామీణ వైద్యులకు నూతన వైద్య విజ్ఞాన అవగాహన అత్యంత అవసరమని, రిచ్ హాస్పిటల్ నేపథ్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వినియోగించుకోవాలని రిచ్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డా.తెనాలి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎం.సి.ఎస్. కళ్యాణ మండపంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్స్ కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యవర్గ ఎన్నికల ముందు ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తెనాలి వసంతలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అందిస్తున్న సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలో విజయవంతమైన శిశురక్ష కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. నెల్లూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు, నాయుడుపేట డివిజన్స్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటిం చారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అనుముల జయప్రకాష్, రాష్ట్ర అధ్యక్షులు తొరాటి ప్రభాకర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బి.టి. రాజు, రాష్ట్ర కోశాధికారి శాఖవరపు వేణుగోపాల్, నెల్లూరు, కావలి, గూడూరు, ఆత్మకూరు డివిజన్స్ నూతన అధ్యక్షులు జి.శేషయ్య, పివి రమణయ్య, యు.శేఖర్, కె.వెంకటేశ్వర్లు, జిల్లా కో.కన్వీనర్ షేక్ సత్తార్ ఉన్నారు.

పోకూరు 'ఎస్‌బిఐ'లో సిబ్బంది కొరత

ఖాతాదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని పోకూరులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం పొదుపు మహిళలకు ఇటీవల ఆసరా పథకం ద్వారా డబ్బులు వారి పొదుపు ఖాతాలకు జమ చేసింది. ఆయా నగదును తీసుకునేందుకు రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఒక క్యాషియర్‌తో పాటు, ఓ అధికారి, మేనేజరు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతం కావడంతో చిన్నచిన్న సర్వీసులకు సైతం సిబ్బందిపైనే ఖాతాదారులు ఆధారపడతారు. ఈ నేపథ్యంలో మేనేజరు సైతం వారికి సర్వీసు అందిస్తున్నారు. అయినా పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. బస్టాండు సెంటరులో ఉన్న ఎటిఎం పని చేయడం లేదు. పోకూరుతో పాటు, శింగమనేనిపల్లె, బడేవారిపాలెం, కూనిపాలెం, నేకునాంపురం, కాకు టూరు, బొంతవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడ ఖాతాలు కలిగి ఉన్నారు. నిత్యం బంగారం రుణాలు, పొలం తనఖా రుణాలతో పాటు, సాధారణ లావాదేవీలు సైతం భారీగానే జరుగుతుంటాయి. బ్యాంకులో ఖాతాదారులకు సకాలంలో సేవలు అందడం లేదనే విషయంపై సదరు శాఖ మేనేజర్ మహ్మద్ మున్వర్‌ను ప్రజాశక్తి అడిగింది. సిబ్బంది కొరత ఉందని, తమ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. తమశక్తి మేరకు ఖాతాదారులకు సత్వర సేవలు అందించేందుకు సిద్ధంగానే ఉన్నట్లు తెలిపారు.

కుళాయి నీరు విడుదల

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని పోలినేనిచెరువు పంచాయతీ, పెద్దమ్మపాలెం గ్రామంలో ఇంటింటికి కుళాయి నీరు అందించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి ఇటీవల ఆ గ్రామంలో పర్యటించారు. పెద్దమ్మపాలెంలో ఇంటింటికి కుళాయి లేకపోవడం, నీటి సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన జలజీవన మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి కుళాయి సౌకర్యం కల్పించారు. ఆ గ్రామసర్పంచ్ యాళకల సుబ్బరాజ్యం, వైసిపి నాయకులు దగ్గరుండి పనులు చేయించారు. దీంతో ఆ గ్రామస్తులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాళ్ళ శివకుమార్‌రెడ్డి, ప్రగడ శ్రీనివాసులు, యనమల చిన్న, చీమల నరసింహారెడ్డి, సిహెచ్ మాల్యాద్రి ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని అమ్మపాలెం ఎస్సీకాలనీలో గడిచిన గురువారం గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమైంది. ఈ ఘటనలో నిరాశ్రయులైన ఇంద్రకంటి ఎలిశమ్మకు, అదే గ్రామానికి చెందిన సేవాసమితి, బెస్ట్‌ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ తరపున యువకులు చందాలు వసూలు చేసి రూ. 29వేలు నగదును ఆదివారం ఎలిసమ్మ కుటుంబ సభ్యులకు అందించారు. విద్యార్థులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

కోడూర్ తీరంలో సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : పర్యాటకుల రాకపోకలతో మండలంలోని కోడూరు సముద్ర తీరంలో సందడి నెలకొంది. ప్రతి ఆదివారం, పండుగ రోజుల్లో, సెలవు దినాల్లో కోడూరు సాగర తీరం పర్యాటకుల రాకపోకలతో ఎంతో కళకళ లాడుతూ దర్శన మిస్తుంది. అందులో భాగంగా ఈ ఆదివారం కూడా కళకళలాడింది.

గోపాలకృష్ణ చౌదరి పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న టిడిపి నేత సోమిరెడ్డి

విజయ డెయిరీ మాజీ చైర్మన్ గోపాలకృష్ణ చౌదరి మృతి

పలువులు సంతాపం

గోపాలకృష్ణ చౌదరి (ఫైల్)

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

టిడిపి సీనియర్ నేత, స్వాములు, రాజకీయంగా విలువలు పాటించిన నెల్లూరు విజయ డైరీ మాజీ చైర్మన్ ముప్పవరపు గోపాలకష్ణయ్య చౌదరి (93) శనివారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. టిడిపి అభివృద్ధికి, విజయడైరీ చైర్మన్‌గా ఆయన బాగా పనిచేశారు. ఆయన సమయంలోనే అనేక మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. రాజకీయాల్లో సీనియర్ నేతగా అందరితో కలిసి మెలిసి ఉండేవారు. వివాదరహితుడుగా, రాజకీయాల్లో పెద్ద వ్యక్తిగా ఉన్నారు. ఆదివారం సాయంత్రం బొడిగాడి తోటలో అంత్యక్రియులు నిర్వహించారు. మరణించడం పట్ల భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో పాడి పరిశ్రమ అభివద్ధికి వారు ఎంతో కషి చేసి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోడ్పడ్డారని వెంకయ్య నాయుడు చెప్పారు. అమెరికా పర్యట నలో ఉన్న వెంకయ్య నాయుడు.. గోపాలకష్ణయ్య మరణ వార్త విని అక్కడి నుంచి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. రైతులు,పల్లె వాసుల కష్ట నష్టాలు బాగా తెలిసిన గోపాలకష్ణయ్య వ్యక్తిగతంగా తనకెంతో ఆప్తులని, వారు ఎంతో సహదయులు అని చెప్పారు. వారి మరణం నెల్లూరు జిల్లా పాడి పరిశ్రమకు, పాడి రైతాంగానికి తీరని లోటు అని అన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పెద్దలు గోపాలకష్ణయ్య చౌదరి తమ కుటుంబానికి 40 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. 22 ఏళ్లపాటు విజయ డెయిరీ చైర్మన్ గా వ్యవహరించిన ఆయన పాడి రైతులకు అన్నివిధాల అండగా నిలవడంతో పాటు డెయిరీని అభివద్ధి పథంలో నడిపించారన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి .,తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

దూడను చంపేశారని ఫిర్యాదు..

ప్రజాశక్తి-గుడ్లూరు :

ఓ బర్రె దూడ తన చేలో మేత మేసిందని ఆగ్రహం చెందిన ఓ ధనకి రైతు దూడనికొట్టి చంపేసిన సంఘటన గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం లో ఆదివారం జరిగింది. చంపివేసిన దూడని బాధితురాలు రాజమ్మ ఇంటి వద్దకు తీసు కువచ్చి పడేశారు.చేలోకి పశువులే కాదు.. మనుషులు వచ్చినా చంపివేస్తామని, హెచ్చరించి కులం పేరుతో దూషించి వెళ్లిపోవడంతో బాధితురాలు రాజమ్మ గుడ్లూరు పోలీస్టేషన్‌కు చేరుకుని నిందితుడు సింగయ్య పై ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన పోలీసులు ఘనటా స్థలానికి చేరుకుని మతి చెందిన దూడని ఫోటో తీశారు. విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు పోలీ సులు తెలిపారు. కులం పేరుతో దుర్భాషలాడిన నిందితుడు సింగయ్య పై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

వైసిపికి ప్రత్యామ్నాయం జనసేన

మాట్లాడుతున్న మనుక్రాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-సీతారామపురం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు యువత, ప్రజలు విసుగు చెంది ప్రత్యామ్నాయంగా జనసేన వైపు అడుగులు వేస్తున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపాన జనసేన జిల్లా కార్యదర్శి ఆలూరి రవీంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ నమ్మకం ధైర్యం భరోసా ఇవ్వగల ఏకైక నిజాయితీగల నాయకుడు పవన్‌కళ్యాణ్ మాత్రమేనని కావున ప్రజలందరూ జనసేన పార్టీకి అండగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్ తరాల కోసం జనసేన వైపు అడుగులు వేసి పవన్‌కళ్యాణ్‌కు మద్దతుగా ఉంటూ జనసేన పార్టీని ఆదరించాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రోడ్లు సరిగా లేవని కనీసం తాగునీటి వసతులు లేని మెట్ట ప్రాంతాన్ని దశాబ్దాల కాలంగా ప్రతినిధులుగా ఉంటున్న వారు చేసింది శూన్యమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు అధికారంలో ఉన్న ప్రభుత్వం నాయకులు పట్టించుకోకపోయినా ప్రజా కష్టాలను తెలిసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి లక్ష రూపాయల వంతున అందిస్తున్నారన్నారు. ప్రతి జనసైనికుడు ఇప్పటి నుండే ప్రతి ఇంటికి అధికార పార్టీ చేస్తున్న మోసాలను వివరించి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలను సంక్షేమాలను అభివృద్ధిని వివరించి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయాలని కోరాలన్నారు. 2024 ఎన్నికల్లో జనసేన గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. త్వరలో ప్రతి మండలంలో పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తామన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్, ఆత్మకూరు ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల జనసేన అధ్యక్షులు శ్రీనివాసులు, సురేంద్ర, వినుకొండ, రవికుమార్ తదితరులున్నారు.

15లోగా ఈకెవైసి చేయాలి

ప్రజాశక్తి-కావలి : జిల్లాలోని పెన్షనర్లందరూ 15వ తేదీలోగా ఈకెవైసి చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ ఆఫీసర్ సూచించారని ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల రమణయ్య ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు తమ ఆధార్‌కార్డ్‌కు లింక్ అయి ఉన్న ఫోన్ నెంబరును సిఎఫ్ఎంఎస్‌కు లింక్ చేయడం, చిరునామా తదితర వివరాలు నమోదు చేసుకోవడం ఈ.కె.వై.సి. చేయించడం అవుతుందన్నారు. కావున కావలి ట్రెజరీ పరిధిలోని సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లందరూ స్వయంగా, ట్రెజరీలో, పెన్షనర్ల భవనంలో తప్పక నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఏదైనా సమాచారంకోసం తనను తన మొబైల్ నెంబర్9985237349, ద్వారా నివృత్తి చేసుకోవాలని రమణయ్య తన ప్రకటనలో కోరారు.

'సంయుక్త' ఆధ్వర్యంలో పిల్లల సంరక్షణ

ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలో ఉన్న 27 మంది పిల్లలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు బియ్యం, పిల్లల పేర్లు మీద పోస్టాఫీసు నందు ప్రతినెలా రూ.1000 నగదు జమచేస్తున్న పాస్ పుస్తకాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కావలి ఐ.ఎం.ఎ. వైద్య బృందం డాక్టర్ బెజవాద రవి కుమార్, డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ కె.ఆనంద్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా నేటికీ ఏడు నెలలుగా తల్లి తండ్రుల ఆదరణ లేని 27 మంది పిల్లలను వారి సంరక్షణ వద్దనే ఉంచి వారి సంరక్షణ బాధ్యతలు స్వీకరించి వారికి అవసరమైన విద్య, వైద్యం సంరక్షణ అందించడం అభినందనీయమని తెలిపారు. పిల్లలకు సహాయం అందజేస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. పిల్లలు శ్రద్ధగా చదువుకొని, మంచి ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. సంయుక్త సేవా సంస్థ ద్వారా నేడు గుంటూరు జిల్లా, పెద్ద కాకాని, నీలమ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ జ్యోస్నారెడ్డి - శౌరీలు దంపతులు ముగ్గురు పిల్లల్ని, డాక్టర్ బెజవాద రవి కుమార్ వియ్యంకులు ఎన్.ఆర్. ఐ.సామ్ టి సదాన్స్ - అముద సదాన్స్ దంపతులు మరో ఇద్దరు పిల్లల్ని చదువుని సంరక్షించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలు పుతూ ఉన్నామని తెలిపారు. సంస్థకు దాతలను ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బెజవాద రవి కుమార్‌కు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ధన్యవాదాలు తెలిపారు. అలాగే నేటి వరకూ పేద పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకొని సహాయం అందజేస్తున్న దాతలు డాక్టర్ బి.రాజేంద్ర ప్రసాద్ - రాధ దంపతులకు, డాక్టర్ బి సతీష్ - డాక్టర్ పి ఆశారాణి దంపతులకు, డాక్టర్ పి శ్రీధర్ - డాక్టర్ కె యాన్సీ దంపతులకు, డాక్టర్ కె ఆనంద్ కుమార్ - డాక్టర్ టి మాధవిలత దంపతులకు, డాక్టర్ పి పద్మజ, డాక్టర్ బెజవాడ విలీజ్ - డాక్టర్ బెజవాడ సాల సదాన్స్ దంపతులకు, బిబిఎస్ అధినేత బెజవాడ ప్రకాష్-శకుంతల దంపతులకు, పొదార్తి వెంకటేశ్వర్లు - ప్రమీల దంపతులకు, యమ్ నితిన్ కుమార్ - నిఖిల దంపతులకు, చిన్నారి దాత కె సంజనా కృష్ణకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కావలి పట్టణానికి చెందిన గ్రీన్ హ్యాండ్స్ సభ్యురాలు వేమూరి శ్రీలేఖ జన్మదిన సందర్భంగా నేడు సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు నోట్ బుక్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుర్రా రఘుకుమార్ రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, ఎమ్ఎవి ప్రసాద్ రావు, గ్రీన్ హ్యాండ్స్ అధ్యక్షురాలు వేమూరి గాయత్రి, వేమూరి.శ్రీలేఖ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలు పాల్గొన్నారు.

రూ.30వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కావలి : స్థానిక 33వ వార్డుకు చెందిన కమ్మురివీధిలో కాపురం ఉండే ద్రోణాదుల రాఘవాకు 6 నెలల క్రితం పక్షవాతం వచ్చి, బ్రెయిన్ స్ట్రోక్ తగిలి, ఊపిరితిత్తుల సమస్యతో చెన్నైలోని విజయ హాస్పిటల్‌లో, నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌లో గుంటూరులోని సాయిరత్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గుంటూరులోని చైతన్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. దరిదాపు ఈ ఆరు మాసముల నుండి ద్రోణాదుల రాఘవ చికిత్స నిమిత్తం రూ.10 లక్షల నుండి రూ.12 లక్షల వరకు అయింది. వృత్తిరీత్యా ముడత పిండి వ్యాపారం చేసుకునేవాడు. ఆ చిన్నపాటి వ్యాపారంతో కుటుంబ పోషణ జరుగుతుండేది. ఆరు నెలల క్రితం ఆరోగ్యం బాలేక పైన తెలిపిన నాలుగు హాస్పిటల్లో చికిత్స పొందడ దానికి దరిదాపుగా అందరి వద్ద రూ.10 లక్షలకు పైగా అప్పులు చేశారు. నేటికీ రోగం నయం కాకపోవడంతో కావలి మండల ఆర్యవైశ్య సంఘం, కావలి డివిజన్ ఆర్యవైశ్య సంఘం, పట్టణంలోని ఆర్యవైశ్య ప్రముఖులందరూ కలిసి ఆదివారం ద్రోణాదుల రాఘవ నివాసానికి వెళ్లి వారి కుటుంబానికి రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు డాక్టర్ శ్రీరామ్ మనోహర్ బాబు, మామిడి రామకృష్ణ, అమరా వేదగిరి సుబ్బారాయుడు గుప్తా, వీరబ్ర కిషోర్ గుప్తా, ఓరుగంటి రామకృష్ణ, పొదార్తి నాగరాజు, వాకాటి మాల్యాద్రి, ఎవిఎస్‌కెఆర్ మాలి, పెట్లూరి రమేష్‌బాబు, పొన్నూరు శ్రీనివాసులు, పబ్బతి సత్యనారాయణ, విశ్వనాధుని కిషోర్, గరంతెట్టి మధుసూదన్ రావు, చిన్న కొండలరావు, నల్లూరి వెంకట రమేష్, గోల్ల వెంకట సుధాకర్, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, పెనక వెంకటేశ్వర్లు, వెలుగూరి వెంకట ఈశ్వర్, నవీన్ కుమార్, నల్లూరు రామకృష్ణ, నేరెళ్ల ఉదయ్, గుంట్ల చంగల్ రావు, దుగ్గిశెట్టి నవీన్, నవీన్ కుమార్ రాము పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు ఎస్ఐబి స్టేషన్‌కి సంబంధించిన టివిఎస్ రైడర్ మోటార్ బైక్, బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, మహీంద్ర బొలెరో పికప్ ఎల్ఎస్‌వి సోమవారం ఆ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐబి సిఐ నరహరి ప్రకటనలో తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అచ్చమాంబకు పొంగళ్లు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పొంగూరు మాలిచేలలో వెలసిన అచ్చమాంబ తల్లి 16 రోజుల పొంగళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండలం చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం 16 రోజులు పొంగళ్ల ఉత్సవాలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో చెదురుమొదురుగా వానలు కురవడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కీటక జనిత వ్యాధుల భారిన పడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధులకు గురికాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య మాటల్లో ..

ప్రశ్న. సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. జిల్లాలో డెంగీ వ్యాధితో ఎంత మంది చికిత్సలు తీసుకున్నారు. మరణాలు ఏమైనా సంభవించాయా..?

జవాబు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మలేరియా, డెంగీ వ్యాధులను ఏ విధంగా అరికట్టాలి. ఈ వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులు ప్రధానంగా తీసుకొని నగర, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. బిసి వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌కు చెందిన ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. ఆశాలు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, సూపర్‌వైజర్ల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో డెంగీ కేసులు 68 నమోదు కాగా మలేరియా 6 కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. ఎటువంటి మరణాలు నమోదు కాలేదు.

ప్రశ్న. వృద్ధులు, పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

జవాబు. రోగ నిరోధక శక్తి తగ్గిన సమయంలో అనారోగ్య సమస్యలు ఒక్క సారిగా బహిర్గతమవుతాయి. ఈ సీజన్‌లో ఎక్కువగా శ్వాసకోస సంబంధిత వ్యాధులు బయట పడతాయి. శ్వాసకోశ నాళాల సామర్థ్యాన్ని కోల్పోవడంతో వైరస్ సులువుగా శరీరంపై దాడి చేస్తాయి. ఇమ్యూనిటీ సిస్టమ్‌ను పెంచుకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. పోషక విలువల కూడిన ఆహారం తీసుకోవడం ఎంతో ఉపయోగకరం.

ముఖాముఖి

ప్రశ్న. జిల్లాలో పలు స్కానింగ్ సెంటర్లలో పిసిపిఎన్‌డిటి చట్టాన్ని అతిక్రమించి లింగనిర్థారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలు మీ దృష్టికి వచ్చాయా..?

జవాబు. జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టం పటిష్ఠంగా అమలు జరుగుతుంది. ఈ చట్టం అమలు తీరును పరిశీలించేందుకు క్రమం తప్పకుండా జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరుగుతున్నాయి. అంతే కాకుండా వారంలో రెండు, మూడు రోజులు క్రమం తప్పకుండా జిల్లాలోని ప్రయివేట్ వైద్యశాలలను, స్కానింగ్ సెంటర్లను, తనిఖీ చేస్తున్నాం. ఈ తనిఖీల సమయంలో రిజిస్టర్లు పరిశీలన చేస్తున్నాం. వాస్తవానికి ప్రయివేట్ వైద్యశాల నిర్వహించాలన్నా, స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలన్నా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసే సమయంలో ఈ అనుమతులు ఉన్నాయా లేవా పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలకు నోటీసులు అందజేస్తున్నాం.

యువగళం పాదయాత్ర విజయవంతం

- నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి

ప్రజాశక్తి-కోవూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కోవూరు నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తి చేసుకుందని టిడిపి కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. యువగళంను ఇంతటి విజయవంతంగా నిర్వహించినందుకు నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలంరెడ్డి దినేష్ రెడ్డి మాట్లాడుతూ విజయోత్స ర్యాలీకి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అభినందనలు తెలుపుతున్నాన న్నారు. జిల్లాలో నారా లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టి లోకేష్‌ను ప్రజలందరూ దీవించినట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే 4000 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టిన ఘనత నారా లోకేష్‌కు సొంతమన్నారు. కోవూరు నియోజకవర్గంలోకి 1900 కిలోమీటర్లుకి అడుగుపెట్టి ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెముకుల కృష్ణచైతన్య, ఇంత మల్లారెడ్డి, బాలరవి, నాటకరాణి వెంకట్, కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, జెట్టి రాజగోపాల్‌రెడ్డి, చెరుకూరి మహేష్, వేగూరు సుబ్బానాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండలాగు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో ఆదివారం పెనుకొండమ్మ తిరుణాల కార్యక్రమంలో ఎడ్లబండలాగు పోటీలను ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనుగొండ అమ్మ తిరణాల కార్యక్రమం జూలదిన్నె గ్రామంలో పండగ వాతావరణంలో ప్రజలు జరుపుకుంటున్నారని, ఆ దేవుని ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జిఎంకె ట్రస్ట్ ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఉదయగిరి : గండిపాలెం గ్రామానికి చెందిన గోరంట్ల ఓబయ్య కుమారుడు కిష్టయ్యకు జిఎంకె ట్రస్ట్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం మండలంలోని గండిపాలెం గ్రామానికి చెందిన కిష్టయ్య ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాద విషయాన్ని కుటుంబ సభ్యులు మండల ఉపాధ్యక్షులు జిఎంకె ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండ చౌదరి తన ప్రతినిధులతో వైద్య ఖర్చు నిమిత్తం రూ.10వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, పాముల రాజా, గోసు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

3 గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని నాగేంద్రపురం సమీపంలోని పశువుల మేత కోసం నిల్వచేసిన 3 గడ్డివాములు ఆదివారం అగ్నికి ఆహుతైన ఘటన ఆదివారం ఆత్మకూరు పట్టణంలో చోటుచేసుకుంది. దాంతో సుమారు లక్షా ఎనభై వేల రూపాయలు నష్టం వాటిల్లింది. వివరాల మేరకు.. పట్టణంలోని కందవీధి, పంట వీధికి చెందిన రైతులు ఆత్మకూరు వెంకటేశ్వర్లు, పెంచలయ్య తదితరులు ఒక్కొక్కరు తమకున్న పశువుల మేత కోసం సొంత గడ్డితో పాటు పలుచోట్ల కొనుగోలు చేసి ఒక్కొక్కరు సుమారు 20 ఎకరాల గడ్డివాములు కొనుగోలు చేసి రాములు వేశారు. ఆదివారం సాయంత్రం ఆకతాయిలెవరో బీడీ తాగి పడవేయడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒకసారిగా మూడు గడ్డివాముల్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి టి.రమేష్ తమ సిబ్బందితో మంటలు అదుపులోకి తెచ్చారు. అజ్ఞ ప్రమాద ఘటనలో గడ్డి వ్యక్తం కావడంతో తమ పశువులకు మేత సైతం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల కోరారు.

కానరాని వాన జాడ..

కమ్ముకొంటున్న మేఘాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

జిల్లాలో అత్యంత అనావృష్టి ప్రాంతమైన వరికుంట పాడు మండలంలో వర్షం దోబూచు లాడుతుంది. ప్రతిరోజూ మేఘాలు జల్లులా కురుస్తున్నట్లు భ్రమింపజేస్తున్నాయి తప్ప వర్షం మాత్రం రావడం లేదు. దాంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. చినుకు కోసం రైతులు నెలలు తరబడి వేచి చూస్తున్నారు కానీ వాన జాడే లేదు. రుతుపవనాల రాక అత్యంత ఆలస్యం అవుతుండడంతో పంట సాగు చేసేందుకు కూడా రైతులు ఆలోచిస్తున్నారు. మేఘమా వర్షించు అంటూ రైతన్నలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యతో అవస్థలు

- ఆగిన రోడ్డు విస్తరణ గ్రహణం వీడేదెన్నడో..!
- మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు పాలకవర్గం

ఆత్మకూరు పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి పలువు మండలాలలో నుండి గ్రామాల నుండి నిత్యం వేలాది మంది ప్రజలు వాహనదారులు పలు పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. దాంతో ట్రాఫిక్ సమస్య ప్రయాణికులకు తలనొప్పిగా మారింది. పట్టణంలో 32వేల మంది పైగా జనాభా ఉన్నారు. వాహనాలు పెరిగాయి. గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో ఉన్న రోడ్లు నూతన మున్సిపాలిటీగా కొలువుదీరిన అనంతరం పట్టణాన్ని అభివృద్ధి చేయడం కోసం ఆనాటి ప్రభుత్వం ఆనం రామనారాయణరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆత్మకూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారు. అందులో భాగమే నెల్లూరుపాలెం నుండి పట్టణంలోని సోమశిల రోడ్డు కూడలి వరకు ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో సోమశిల సెంటర్ నుండి కాంగ్రెస్ కార్యాలయం భవనం వరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిధులు వెచ్చించి రోడ్డును విస్తరించి డివైడర్లను సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్‌టిసి డిపో వరకు కొందరు దుకాణాదారులు భవనాల యజమానులు రోడ్డు మధ్య నుండి 40 అడుగులు రోడ్డు విస్తరిస్తే తమ స్థలాలు కోల్పోతాయని అభ్యంతరాలు తెలిపారు. దాంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వం మారడంతో విస్తరణ పనులు పూర్తిగా మరుగున పడ్డాయి. ఈ రోడ్డు విస్తరణ పనులు చేయకపోవడంతో రోడ్డు చిన్నదిగా ఉన్న షాపుల వద్ద ద్విచక్ర వాహనాలు పెట్టడంతో బస్సులు, లారీలు వచ్చిన క్రమంలో సోమశిల సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు నిత్యం ట్రాఫిక్‌తో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల సోమశిల సెంటర్ మలుపు వద్ద ఒక సిమెంట్ లోడులో ఉన్న లారీ తిప్పుకునే క్రమంలో లారీ కింద ద్విచక్ర వాహన చోదకుడు కింద పడ్డారు. అక్కడ ఉన్న దుకాణదారులు పెద్దగా కేకలు వేయడంతో కిందపడ్డ ద్విచక్ర వాహనాన్ని ప్రమాదం నుండి తప్పించారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. ఇటీవల స్థానిక ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి సొంత నిధులతో రూ.4.50 కోట్లతో నూతన బస్టాండ్‌ను నిర్మించారు. నిర్మించే క్రమంలో బస్టాండ్లు డిపో వద్దనే నిలిచిపోయాయి. 8వ తేదీ బస్సులు బస్టాండ్‌కు రావడం ఎంఎల్‌ఎ ప్రారంభించారు. అప్పటినుండి బస్టాండ్‌కు బస్సులో రావడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని ప్రయత్నించారు. మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆయన అకాల మరణంతో ఆయన స్థానంలో ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆయన లేని లోటు తీరుస్తానని ప్రజలకు వాగ్దానం ఇచ్చారు. అయితే ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ఆయన చేతుల మీదగా ఉంది. ఆత్మకూరులో ప్రధాన సమస్య సోమశిల సెంటర్ నుండి ఆర్‌టిసి వరకు నిత్యం వాహనాల రద్దీతో ప్రజల అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఆయన పరిష్కరిస్తారని ప్రజలు కోరుతున్నారు.

నిషేధిత బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ఎబిఎం చర్చి స్థలంలో క్రయ విక్రయాలు నిషేధిత మని క్రైస్తవులు హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరహక్కుల సంఘం జనరల్ సెక్రటరీ చిలుకా చంద్రశేఖర్‌తో బోర్డును ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక స్టేట్‌పేటలో బిఎంసిబి చర్చి సంఘ సభ్యులు పాల్గొని భారీ ఊరేగింపుగా వెళ్లారు. చర్చి ఆస్తులో క్రయవిక్రయాలు జరిపితే శిక్ష అర్హులు అనే బోర్డును ప్రతిష్టించారు. గతంలో చర్చి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఆపిన 18 మంది స్థానక క్రైస్తవులపై రిజిష్టరైన నెంబర్ 70/2022ను కోర్టు కొట్టి వేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రాష్ట్ర పౌరహక్కుల సంఘం జనరల్ సెక్రటరీ చిలుకా చంద్రశేఖర్ బోర్డు ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ఈ స్థలాన్ని ఎవ్వరూ అమ్మరాదని ఎవరికీ హక్కు లేదన్నారు. 100 సంవత్సరాల క్రితం క్రైస్తవ మిషనరీ వారు నిరుపేద క్రైస్తవుల అభివృద్ధి కోసం ఎంతో శ్రమకోర్చి వారు ఈ స్థలాన్ని కొన్నారని ఆస్థలం నిరుపేద క్రైస్తవుల అభివృద్ధికే తోడ్పడాలని, ఎవరో దర్శనంగా వచ్చి ఇద్దరి ముగ్గురి అభివృద్ధికి కాదన్నారు. క్రైస్తవులంతా ఐక్యమత్యంగా ఉండి చైతన్య వంతులు కావాలని ఆయన కోరారు. అనంతరం సంఘ సభ్యులు ముఖ్య అతిథిగా విచ్చేసిన చిలుకా చంద్ర శేఖర్ సన్మానం చేశారు.

'యువగళం' విజయవంతానికి పిలుపు

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకటరామారావు

ప్రజాశక్తి-ఉదయగిరి

నియోజకవర్గంలో ప్రారంభం కానున్న యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చెంచల బాబుయాదవ్ అతిథి గృహంలో ఉదయగిరి దత్తలూరు, సీతారాంపురం మండలాలకు చెందిన పార్టీ నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11న నియోజకవర్గానికి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమవుతుందని ఈ ప్రారంభానికి అధిక సంఖ్యలో నాయకులు కార్య కర్తలు అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా 12వ తేదీ సాయంత్రం కొండాపురంలో జరిగే బహిరంగ సభ 35వేల మంది జనాభా సమీకరించాలని నాయకులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సభను విజయవంతం చేస్తే నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇది గోవర్ధనగిరి కాదని ఉదయగిరి అని ఇక్కడ ప్రజలు చైతన్యవంతులని ఈ ప్రాంత అభివృద్ధి వారే నిర్ణయిస్తారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మాట తప్పని మడమ తిప్పని వ్యక్తిగా జగన్మోహన్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని, అది ఒక నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధి అంటే తెలుగుదేశం పార్టీ నారా చంద్రబాబు నాయుడు అని అందరికీ తెలుసునని వైసిపి నుండి ఎంపికైన ముగ్గురు ఎంఎల్‌ఎలను జగన్మోహన్ రెడ్డి రోడ్డున పడవేస్తే చంద్రబాబు నాయుడు వారిని ఆదరించారని గుర్తు చేశారు. అభివృద్ధిపై మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయ రామిరెడ్డి నేను చేసిన అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పి చైర్మన్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబుయాదవ్, మాజీ ఎఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్, మాజీ ఎంపిపి శ్రీకుర్తి రవీంద్రబాబు, మాజీ జెడ్‌పిటిసిలు శ్రీధర్, మల్లికార్జున, కలివెల జ్యోతి, మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న, బొజ్జ నరసింహులు, మైనార్టీ నాయకులు రియాజ్, యువ నాయకులు సందాని, రాజా, నరసింహులు, వెంకటస్వామి, మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'యువగళం'కు ఘన స్వాగతం

గజమాలతో లోకేష్‌కు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గ్రామస్తులతో ఫొటో దిగుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-కావలిరూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు 'యువగళం' పాదయాత్ర కావలి మండలంలోని అన్నగారిపాలెం గ్రామానికి చేరుకుంది. పార్టీ కావలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యువకులు పాదయాత్రను మంగళ వాయిద్యాలతో బాణాసంచా పేలుస్తూ భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. సామాన్య ప్రజానీకం సమస్యలు వింటూ అండగా ఉంటానని టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తామని లోకేష్ బాబు ప్రజలకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. పాదయాత్రలో లోకేష్ బాబుకు మద్దతుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నాయకులు అభిమానులు మహిళలు అక్క చెల్లెలు పాల్గొన్నారు. లోకేష్‌ను కలిసేందుకు వివిధ సామాజిక వర్గ ప్రజలు స్థానిక ప్రజలు తరలి వచ్చారు. పల్లె వాసులను ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ తానున్నానంటూ భరోసా ఇస్తూ లోకేష్ బాబు ముందుకు సాగారు. పల్లె జనం టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు కూడా యువనేతకు హారతిపట్టి ఘన స్వాగతం పలకడమే కాక ఓ వైపు మంగళ వాయిద్యాలు మోత మరోవైపు పూల వర్షంతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. యువగళం పాదయాత్రలో వివిధ వర్గాల ప్రజలతో సమావేశమైన నారా లోకేష్ వారి సాదకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మొదలైన అభివృద్ధి పనులపై జగన్ ప్రభుత్వం నిలుపుదల చేసి కారణంగా ఈ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు ఇంకెంతకాలం 9 నెలలు ఓపిక పట్టండి అధికారంలోకి తెలుగుదేశం ప్రభుత్వం వస్తుందని ఆ వెంటనే ప్రజలకు రైతులకు అక్కాచెల్లెళ్లకు సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని భరోసానిచ్చారు. అనంతరం అన్నగారిపాలెం నుంచి ఓట్టారు, నడింపల్లి, మామిర్ల దరువు, పువ్వుల దరువు, చిన్ననట్టు, పెద్దనట్టు మీదుగా తుమ్మలపెంటకు నారా లోకేష్ బాబు పాదయాత్ర చేరుకుంది. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత కావ్య కృష్ణారెడ్డి, పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపిలోకి రాష్ట్ర టిడిపి ఎస్‌సిసెల్ నేత

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్ర టిడిపి ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి మందా రవికుమార్ మాదిగ వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం కోవూరు తూర్పు అరుంధతీయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవి మాదిగ తన అనుచరులతో కలిసి వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్‌కు జై కొడుతున్నారన్నారు. జగన్ సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది ఇతర పార్టీల నాయకులు వైసిపిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి పని ఇక అయిపోయిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ఖాళీ అయిపోవడం తథ్యమన్నారు. మందా రవి తన కుటుంబసభ్యుడు అని ప్రజా సేవలో నిరంతరం అంకితమై వుండే క్రమశిక్షణ గల నేత అని కొనియాడారు. కార్యక్రమంలో దొడ్డంరెడ్డి నిరంజన్ రెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, శివుని నరసింహులురెడ్డి, జెడ్‌పిటిసి శ్రీలత, ప్రసాద్ పాల్గొన్నారు.